క్లుప్తంగా

క్రీడల్లో రాణించాలి

నల్లగొండ టూటౌన్ : క్రీడాకారులు తమకు నచ్చిన క్రీడల్లో రాణించి పేరు ప్రతిష్టలు పొందాలని టూటౌన్ సీఐ డానియెల్ అన్నారు. తెలంగాణ స్టేట్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కలర్ బెల్టు ప్రమోషన్ టెస్టుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నిరంతర సాధన చేయడం ద్వారా పోటీల్లో గెలుపొందవచ్చన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చింత అనిల్‌కుమార్, కె.శ్రీకాంత్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెర్కకొండారం వాసికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వీరభద్రం

శాలిగౌరారం: మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన భీమనబోయిన వీరభద్రంకు డాక్టరేట్ దక్కింది. వీరభద్రం హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో అమ్మజ్యోతి అనాథాశ్రమాన్ని ఏర్పాటు చేసి మూడు సంవత్సరాలుగా ఎంతోమంది అనాథలకు సేవ చేస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన న్యూఢిల్లీకి చెందిన 'హోప్ తియలాజికల్ యూనివర్సిటీ' 'డాక్టరేట్ ఆఫ్ బెస్ట్ సోషల్ సర్వీస్' అవార్డును ప్రకటించింది. బుధవారం రాత్రి న్యూఢిల్లీలోని 'హోప్ తియలాజికల్ యూనివర్సిటీ'లో వీరభద్రంకు డాక్టరేట్ అందజేశారు.

'త్వరలో నిర్ణయాన్ని ప్రకటిస్తా'

నల్లగొండ : రెండు, మూడు రోజుల్లో రాజకీయ భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకుడు పిల్లి రామరాజుయాదవ్ తెలిపారు. గురువారం నల్లగొండలో నిర్వహించిన కార్యకర్తలతో సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా కార్యకర్తల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తల నిర్ణయం మేరకే భవిష్యత్ నిర్ణయం తీసుకుంటానని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తనతోపాటు పనిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

చామల ఎంపికపై స్వీట్ల పంపిణీ

నకిరేకల్ : భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్వీట్లు పంచుకుని బాణసంచా పేల్చారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బొడ్డు నాగరాజు, గునగంటి రాజుగౌడ్, యానాల శ్రీనివాస్‌రెడ్డి, బొప్పని యాదగిరి, అబ్దుల్ మాజీద్, ముత్యాల అంజి, భిక్షంరెడ్డి, వంటిపాక వెంకన్న, గోగికార పరమేష్, పుల్లిగిల్ల శంకర్, నగేష్ పాల్గొన్నారు.

పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుక అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి

చిట్యాల: మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డుకు చెందిన పాల చంద్రయ్య కూతురు నవ్య వివాహం సందర్భంగా గురువారం చిట్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి పెళ్లి కానుకగా రూ.10 వేలు అందజేశారు. మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వార్డులోని ప్రతి ఆడ బిడ్డ వివాహానికి లింగస్వామి పదివేల పదహారు రూపాయలు అందిస్తున్నారు.

విద్యార్థులకు కంటి, వినికిడి పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మర్రిగూడ: మండలంలోని దామెరభీమనపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు గురువారం గ్రామంలోని హుటి సీఎస్‌సీ డిజిటల్ సేవా నిర్వాహకులు జిల్ల కిశోర్ ఆధ్వర్యంలో కంటి చూపు, వినికిడి, ప్రాథమిక సమస్యల పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హుటి సీఎస్‌సీ డిజిటల్ సేవా ఆర్గనైజింగ్ మేనేజర్ జిల్ల జ్యోత్స్న, వైద్యులు బి.శ్రీకుమార్, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు దివాంత, బాలరాజు, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా లింగయ్య



చిట్యాల: రామన్నపేట బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా చిట్యాల పట్టణానికి చెందిన అడ్వకేట్ గాలి లింగయ్య గురువారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా చిట్యాల పట్టణానికి చెందిన అడ్వకేట్ నోముల స్వామి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పి.శోభన్ బాబు వ్యవహరించారు.

నిలిచిన ఇసుక ఆన్‌లైన్ బుకింగ్స్

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గృహ నిర్మాణదారులు
- ఉపాధి కోల్పోతున్న కూలీలు, ట్రాక్టర్ల యజమానులు



వంగమర్తి సమీపంలోని మూసీ నదిలో ట్రాక్టర్లలోకి ఇసుక నింపుతున్న కూలీలు (ఫైల్)

శాలిగౌరారం: 'కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్లు'గా ఉంది ఇసుక రవాణా విషయంలో పాలకుల, అధికారుల పనితీరు. ప్రజాప్రతినిధులు, అధికారులు తీసుకున్న అనాలోచిత నిర్ణయాల వల్ల శాలిగౌరారం మండలంలో ఇసుక రవాణా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో గృహ నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు.

శాలిగౌరారం మండలంలో 5 ఇసుక రీచ్‌లు

గత ప్రభుత్వం మండలంలో ఐదు రీచ్‌లను ఏర్పాటు చేసింది. అందులో మూడు ఇసుక రీచ్‌లు జిల్లా మైనింగ్‌శాఖ పరిధిలో, రెండు ఇసుక రీచ్‌లు టీఎస్‌ఎండీసీ(తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) పరిధిలో ఉన్నాయి. టీఎస్‌ఎండీసీ పరిధిలో ఇటుకులపహాడ్, వంగమర్తి గ్రామాల రీచ్‌లు, తుడిమిడి, గురుజాల, మనిమద్దె గ్రామాల్లో జిల్లా మైనింగ్‌శాఖ పరిధిలో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. మైనింగ్‌శాఖ పరిధిలో రీచ్‌ల నుంచి ప్రజల అవసరాలు, గృహ నిర్మాణాలకు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లించి సంబంధిత ఇసుకను ట్రాక్టర్ల ద్వారా మాత్రమే రవాణా చేస్తారు. టీఎస్‌ఎండీసీ ఆధ్వర్యంలో మూసీ ప్రాజెక్టులో డీసిల్టింగ్(ఇసుక పూడికతీత) పేరుతో ఇటుకులపహాడ్, వంగమర్తి గ్రామాల పరిధిలో తీసిన ఇసుక టీఎస్‌ఎండీసీ ఆధీనంలో ఉంటుంది. ఆ ఇసుకను ప్రభుత్వం ప్రాజెక్టులు, భారీ నిర్మాణాలు చేపడుతున్నప్పుడు ఆన్‌లైన్ పద్ధతిలో విక్రయానికి పెట్టినప్పుడు క్యూబిక్ మీటర్ల చొప్పున వినియోగదారులు ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయగా లారీల్లో రవాణా చేస్తారు.

ఆధిపత్య పోరు వల్లనే..

మండలంలోని తుడిమిడి, గురుజాల, మనిమద్దె గ్రామాల్లో సాండ్‌ట్యాక్సీ ఇసుక రీచ్‌ల నుంచి ఆన్‌లైన్ పద్ధతిలో ఇసుక రవాణా జరుగుతోంది. ఇదే అదునుగా భావించిన కొంతమంది అక్రమార్కులు సాండ్ ట్యాక్సీ మాటున చిత్తలూరు, వంగమర్తి గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడ్డారు. దీంతో సాండ్‌ట్యాక్సీపై ఆధారపడి ఉపాధిని పొందుతున్న 453 మంది ట్రాక్టర్ల యజమానులు ఇసుక అక్రమ రవాణా అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈక్రమంలో ట్రాక్టర్ల యజమానుల మధ్య భేదాభిప్రాయాలు వచ్చాయి. ఇసుక రవాణాలో రాజకీయ నాయకులు ప్రవేశించడంతో ఆధిపత్య పోరు ప్రారంభమయ్యింది. దీంతో ఇసుక అక్రమ రవాణాను నూతన ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. రెండు నెలలుగా ఇసుక అక్రమ రవాణాతో పాటూ ఆన్‌లైన్ పద్ధతిలోని సాండ్ ట్యాక్సీ ఇసుక కూడా పూర్తిగా నిలిచిపోయింది. ఫలితంగా గృహ నిర్మాణాలకు ఇసుక లభించని పరిస్థితి ఏర్పడింది.

ఇసుక రవాణాకు ఎదురుచూపులు

తుడిమిడి, గురుజాల, మనిమద్దె గ్రామాల సాండ్ ట్యాక్సీ రీచ్‌ల నుంచి ఇసుక కోసం నిత్యం ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు జరుగుతుండగా ఇసుక రవాణా నిలిపివేసే నాటికి 250 ట్రాక్టర్ ట్రిప్పులు ఇసుక రవాణా జరగకుండా మిగిలిపోయాయి. వినియోగదారులు ఇసుక కోసం ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించినప్పటికీ నేటికీ ఇసుక రాకపోవడంతో ఎదురుచూడక తప్పని పరిస్థితి. మండలంలో సాండ్‌ట్యాక్సీ కింద మైనింగ్ శాఖలో 453 ట్రాక్టర్లు రిజిస్టర్ కాబడి ఉన్నాయి. ఇసుక రవాణా నిలిచిపోవడంతో ట్రాక్టర్ల నిర్వహణ భారంగా మారి 131 ట్రాక్టర్లను సంబంధిత యజమానులు అమ్ముకున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు ఇసుక సరఫరా అయ్యేలా చూడాలని గృహ నిర్మాణదారులు కోరుతున్నారు.

ఇంటి నిర్మాణం ఆగిపోయింది



గ్రామంలో నూతనంగా ఇంటి నిర్మాణం చేపడుతున్నా. ఇంటి నిర్మాణం కోసం 25 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను ఆన్‌లైన్‌లో బుకింగ్ చేశా. ఇసుక బుకింగ్ చేసి నెల రోజులు కావస్తోంది. ఇప్పటి వరకు ఒక ట్రిప్పు ఇసుక మాత్రమే వచ్చింది. మరో 24 ట్రిప్పుల ఇసుక రావాల్సి ఉంది.

– వాసుదేవరావు, అంబారిపేట, శాలిగౌరారం మండలం

నెల రోజులుగా ఎదురు చూస్తున్నాం



రామగిరిలో ఇంటి నిర్మాణం కోసం ఐదు ట్రిప్పుల ఇసుకను ఈ నెల 1న ఆన్‌లైన్‌లో బుక్ చేశా. నెల రోజులు కావొస్తున్నా నేటికీ ఇసుక రాలేదు. ఇసుక లేకపోవడంతో ఇంటి నిర్మాణ పనులకు ఆటంకం కలిగింది. ఆన్‌లైన్‌ను పునరుద్ధరించి ఇసుక రవాణా జరిగేలా చూడాలి.

– నిమ్మల నాగరాజు, రామగిరి, శాలిగౌరారం మండలం

రైతులను ఆదుకోకుంటే ఉద్యమిస్తాం



ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి: ఎండిపోయిన పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులకు ఆదుకోకుంటే ఉద్యమిస్తామని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం నార్కట్‌పల్లి మండలం చిన నారాయణపురం గ్రామ శివారులో ఎండిన పంట పొలాలను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. ఎడమ కాలువకు నీరు విడుదల కాకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు, బావుల కింద పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లు ఏనాడు కూడా సాగు, తాగునీటికి ఇబ్బందులు కలుగలేదన్నారు. ప్రస్తుతం నీరులేక చేతికి వచ్చిన పంట ఎండిపోతోందన్నారు. ఎండిన పంట పొలాలకు ఎకరానికి రూ.30 వేలు నష్టపరిహారంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల ఎకరాలకు రుణ మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ రుణమాఫీ గురించి మాట్లాడడం లేదన్నారు. వారి వెంట బీఆర్ఎస్ రైతు విభాగం మండల అధ్యక్షుడు యానాల అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఆలయ పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం



పార్వతి మహదేవ ఆలయం

శాలిగౌరారం: మండలంలోని మనిమద్దె గ్రామంలో రూ.25 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన పార్వతి మహదేవ ఆలయం పునః ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు. కాకతీయుల కాలంలో నిర్మించిన అత్యంత పురాతన ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరి కూలిపోయేందుకు సిద్ధమైన తరుణంలో గ్రామస్తులు దాతల సహకారంతో అభివృద్ధి పనుల చేపట్టారు.

ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఇలా..

మూడు రోజులపాటు జరుగనున్న ఆలయ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా గురువారం గణ పతిపూజ, పుణ్యాహవాచనం, రుత్విసేవరణము, యాగశాల ప్రవేశం, రక్షాబంధన, దీక్షాధారణ, అఖండదీపస్థాపన, అంకురారోపణ, అగ్నిప్రతిష్ఠ, మంత్రపుష్పం, దేవతాహ్వానం కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 29న మూలమంత్ర జపములు, మహిన్నపనము, ధాన్యాదివాసం, స్థాప్తదేవతా హోమములు, క్షేత్రతర్పణ, రుద్రహోమం, పుష్ప, శయ్యాదివాసములు, మంత్రపుష్పము, 30న గర్త సంస్కారము, దాతు నవరత్న వాసములు, విగ్రహ ప్రతిష్ఠాపన, అష్టదిగ్బంధ ప్రాణ ప్రతిష్ఠానము, కల్యాన్యాపములు, పూర్ణాహుతి, పూర్ణకుంభం, ధేనుదర్శనం, దృష్టిప్రసాదము, ప్రథమపూజ మంత్రపుష్పములు, మహదాశీర్వచనము, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పిస్తున్నాం



నల్లగొండ రూరల్: ధాన్యం తేమశాతాన్ని చూస్తున్న కలెక్టర్ హరిచందన



తిప్పర్తిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

నల్లగొండ రూరల్: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు, నిర్వాహకులకు ఇబ్బందులు లేకుండా నీడ, తాగునీటి వసతి కల్పిస్తున్నట్లు కలెక్టర్ దాసరి హరిచందన తెలిపారు. గురువారం నల్లగొండ పట్టణ పరిధిలోని ఆర్జాలబావి వద్ద ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్రీనివాస్, డీసీఓ కిరణ్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 370 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. వేసవిలో తక్కువ నీరు, ఎక్కువ విస్తీర్ణంలో ఆరుతడి పంటలు, వాణిజ్య పంటలు సాగుచేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నాణ్యమైన దిగుబడి వస్తుందన్నారు. వేసవి నేపథ్యంలో ప్రజల కోసం ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ నాగేశ్వర్‌రావు, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, మార్కెటింగ్ అధికారి శ్రీకాంత్, తహసీల్దార్ శ్రీనివాస్, సీఈఓ అనంతరెడ్డి పాల్గొన్నారు.

ఖాజీరామారం గ్రామంలో..

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ నాగిరెడ్డి అన్నారు. గురువారం నల్లగొండ మండలంలోని ఖాజీరామారం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం వినోదతో కలిసి డీఆర్‌డీఓ ప్రారంభించారు. అనంతరం డీఆర్‌డీఓ మాట్లాడుతూ మిల్లర్లకు తక్కువ ధరకు ధాన్యం అమ్మి నష్టపోవద్దని రైతులకు సూచించారు. రైతుల అవసరాల మేరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ ఏర్పాటు చేయాలని, వేసవిలో రైతులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటివసతి లేని ప్రాంతంలో తాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, రైతులు ధాన్యం తూర్పారబట్టి ధాన్యం తెచ్చి మద్దతు ధర పొందాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకట్‌రెడ్డి, ఏఓ శ్రీనివాస్, సీసీ గీత, ఎస్ఆర్పీ నాగలక్ష్మి, అబ్దుల్, కృష్ణవేణి, లక్ష్మి, సుజాత, షబ్బీర్ బాబా, కృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.

తిప్పర్తిలో..

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఎమ్‌ఓ నాగేశ్వరరావు, డీసీఓ కిరణ్‌కుమార్, ఏడీ శ్రీకాంత్, సీఓ భిక్షమయ్య, ఏఓ సన్నీరాజ్, ఏఈఓ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

● కల్యాణ'మస్తు'





నల్లగొండ: రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురువారం బిజీబిజీగా గడిపారు. నల్లగొండ పట్టణంతో పాటు దర్వేశిపురంలో జరిగిన పలు వివాహ వేడుకలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వివాహానికి హాజరై డ్యాన్స్ చేశారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

కట్టంగూర్ : మండలంలోని మునుకుంట్ల గ్రామ రెవెన్యూ పరిధి గల ఖబ్రాస్తాన్ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని కోరుతూ ఆ గ్రామ ముస్లింలు గురువారం నల్లగొండలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు మాట్లాడుతూ గ్రామానికి చెందిన పన్నాల రవి, మాంద్ర వీరయ్య సర్వే నంబర్ 602బై1లో గల గోరీల స్థలాన్ని ఆక్రమించి పశువుల కొట్టం, గడ్డివాము ఏర్పాటు చేసుకున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్‌కే బాబా, షేక్ ఖాసీం, నూర్‌పాష, మీరాబత్, షేక్ చంద్, శస్య, ఫర్విన్, లతీఫ్ పాల్గొన్నారు.

రచయిత రఘువీర్ ప్రతాప్‌కు సన్మానం

నల్లగొండ: రచయిత రఘువీర్ ప్రతాప్‌ను నల్లగొండలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్ విరామ సమయంలో గురువారం సిలువేరు సాహితి సేవా కళా పీఠం ఆధ్వర్యంలో డీఐఈఓ దస్రూనాయక్ సన్మానించారు. రఘువీర్‌ను పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం ఇటీవల కీర్తి పురస్కారంతో సన్మానించింది. పురస్కారం దక్కిన సందర్భంగా రఘువీర్‌ను సన్మానించినట్లు సిలివేరు సాహితి కళాపీఠం అధ్యక్షుడు సిలువేరు లింగమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, భానునాయక్, నరేంద్ర, సింగం శ్రీనివాస్, నరసింహ, తాటిసెట్టి హేమ్లానాయక్, భద్రయ్య, కళా పీఠం సభ్యులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



కవాతు నిర్వహిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి , పోలీస్ సిబ్బంది

రామగిరి(నల్లగొండ): ఎన్నికల నియమావళిని ఎవరైనా ఉల్లంఘించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలుంటాయని డీఎస్పీ శివరాంరెడ్డి హెచ్చరించారు. డీఎస్పీ శివరాంరెడ్డి నేతృత్వంతో సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ డి.రాజుతో కలిసి గురువారం తిప్పర్తిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెంచినట్లు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కట్టుదిట్టంగా శాంతి భద్రతలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రామ్మూర్తి, సెంట్రల్ ఫోర్స్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

చిట్యాల: మండలంలోని వట్టిమర్తి గ్రామ పరిధిలో జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయాలపాలయ్యారు. వివరాలు.. చిట్యాల నుంచి నార్కట్‌పల్లి వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామ పరిధిలో జాతీయ రహదారి పక్కన గల ఎస్సార్ పెట్రోల్ వద్దకు రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో అదుపుతప్పిన ఆటో డ్రైవర్ అతి వేగంగా ముందుకు వెళ్లి రహదారి పక్కన నిలిపి ఉంచిన కంటైనర్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన జెట్టి యాదయ్య, ఆటోలో ప్రయాణిస్తున్న పల్లపు వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. వట్టిమర్తి గ్రామానికి చెందిన పల్లపు కళమ్మ, పల్లపు యాదమ్మ, రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన కై రంకొండ శ్రీకాంత్‌కు స్వల్ప గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని చికిత్సకు నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చిట్యాల ఎస్‌ఐ సైదాబాబు తెలిపారు.

30న సర్వసభ్య సమావేశం

చిట్యాల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30వ తేదీన ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు గదిలో నిర్వహించనున్నట్లు చిట్యాల ఎంపీడీఓ జయలక్ష్మీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'గుత్తా' ను కలిసిన నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి

నల్లగొండ: బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గురువారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని నల్ల గొండలో కలిసి పూలబొకే అందజేసి, శాలువా కప్పి సన్మానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, కనగల్ జెడ్పీటీసీ చిట్ల వెంకటేశం, నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ కౌన్సిలర్ కవిత యామా దయాకర్, మెరుగు గోపి, నాగులవంచ వెంకటేశ్వర్ రావు, ఐతగోని స్వామి, గోపాల్‌రెడ్డి, నాగార్జున బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నార్కట్‌పల్లి : మండలంలోని ఎల్లారెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సమ్మేళనానికి 1992–1997వరకు ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం తమకు విద్య నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వడ్డే శ్రీనివాస్‌రెడ్డి, అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, దండు నర్సింహ, బండ మీద లింగస్వామి, వడ్డే రాధిక, చిక్కుల నాగలక్ష్మి, సల్వాది రవి, కుక్కల సైదులుతోపాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా తాడూరి పరమేష్

చౌటుప్పల్ : చౌటుప్పల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా పట్టణ కేంద్రానికి చెందిన తాడూరి పరమేష్ ఎన్నికయ్యారు. గురువారం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్ష పదవికి ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్ష పదవికి తాడూరి పరమేష్, గంగదేవి రవీందర్‌లు బరిలో నిలిచారు. తాడూరి పరమేష్‌కు 27ఓట్లురాగా, రవీందర్‌కు 12ఓట్లు వచ్చాయి. దీంతో పరమేష్‌ను బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికల అధికారులు కానుగుల వెంకటయ్య, రాధాకృష్ణ, శంకరయ్యలు ప్రకటించారు.

ఎన్నికల కోడ్ అమలులో అధికారుల నిర్లక్ష్యం!



శాలిగౌరారం: పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే దేశ మొత్తంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. కానీ మండలంలోని అడ్లూరు గ్రామంలో మాత్రం ఎన్నికల కోడ్ అమలుకు నోచుకోవడం లేదు. ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే సంబంధిత అధికారులు బహిరంగంగా కనిపించే రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, ప్రచార చిత్రాలను తొలగిస్తారు. రాజకీయ పార్టీల గుర్తులు, నాయకుల విగ్రహాలు కనిపించకుండా ముసుగులు వేస్తారు. గోడల మీద వేసిన చిత్రాలు కనిపించకుండా చెరిపివేయడమో లేక తెరలు కట్టడమో చేస్తారు. కానీ అడ్లూరు గ్రామంలోని ఎన్నికల నిబంధనలను అధికారులు అమలు చేయడం లేదు. శాలిగౌరారం-నకిరేకల్ మెయిన్ రోడ్డు వెంట ఉన్న గ్రామానికి చెందిన ఓ నాయకుడి విశ్రాంతి షెడ్డు గోడకు పెయింటింగ్ వేసిన రాజకీయ పార్టీలు, నాయకుల చిత్రాలను చెరిపివేయడం లేదు.



అడ్లూరు గ్రామంలో దర్శనమిస్తున్న వాల్ పెయింటింగ్